పక్కాగా వేట నిషేధం..

- మరో 14 రోజుల్లో ముగియనున్న గడువు
- చురుగ్గా వలలు, బోట్ల మరమ్మతులు
- వేటకు సన్నాహాలు చేసుకుంటున్న మత్స్యకారులు

కాకినాడ రూరల్: సముద్రమే వారికి వారి జీవనాధరం. సముద్ర జలాల్లో లభ్యమయ్యే మత్స్య సంపదే వారికి ఉపాధి. నీటిలో పడవతో చేపల వేట సాగిస్తూ ఒడ్డుకు చేరే వరకు ప్రమాదకరంగా గడిపే గంగపుత్రులు దాదాపు 45 రోజులుగా తీరికగా తమ గ్రామాల్లో ఇళ్ల వద్ద కాలం వెళ్లదీస్తున్నారు. చేపల వేట తప్ప మరో జీవనాధరం లేని మత్స్యకారులు ప్రస్తుతం వలల నేతతో పాటు పడవలకు మరమ్మతులు, రంగులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. మరో 14 రోజుల్లో చేపల వేట ప్రారంభం కానుండడంతో బోట్లు, వలలు సిద్ధం చేసుకుంటున్నారు. కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గ పరిధిలో వేలాది మంది మత్స్యకారులు సముద్రంపై ఆధారపడి జీవిస్తున్నారు. కాకినాడ సిటీలో దమ్ములపేట, కొత్త కాకినాడ, ఏటిమొగ, జగన్నాథపురం, రూరల్ నియోజకవర్గ పరిధిలో నేమాం, పోలవరం, సూర్యారావుపేట, వాకలపూడి హార్బర్‌పేట, తూరింగి, పగడాలపేట, కరప మండలంలోని ఉప్పలంక తదితర గ్రామాల మత్స్యకారులు సముద్రంలో చేపల వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రస్తుతం ఆదేశాల మేరకు బంగాళాఖాతంలో చేపల వేట నిషేధం ఏటా లాగానే ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి అమలులోకి వచ్చింది. జూన్ 14న అర్ధరాత్రితో నిషేధ సమయం ముగియనుంది. 61 రోజుల పాటు సముద్రంలో చేపల సంతానోత్పత్తికి చేపల వేటను నిషేధించింది. కాకినాడ సిటీ, రూరల్ పరిధిలో వేట నిషేధం పక్కాగా అమలవుతుండడంతో మత్స్యకారులు పడవల మరమ్మతులు చేపట్టి, రంగులు వేసుకుంటున్నారు. కొత్తగా వలలు నేయడంతో పాటు పాత వలలకు మరమ్మతులు చేసుకుంటున్నారు. వేట నిషేధ సమయం దాదాపు మూడొంతులు కాలం ముగిడంతో మరో 14 రోజులు సముద్రంలో చేపల వేట కోసం సిద్ధమవుతున్నారు.


దమ్ములపేట వద్ద బోట్లకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు


సూర్యారావుపేట వద్ద వలలు నేసుకుంటున్న మత్స్యకారులు

పటిష్టంగా వేట నిషేధం



సముద్రంలో చేపల వేట నిషేధం బాగా అమలైంది, మత్స్యకారులు కూడా అక్రమంగా చేపల వేటాడరాదని తీర్మానించుకున్నారు. చాలా వరకు వేట నిషేధం ముగియడంతో మరో రెండు వారాల్లో వేటకు వెళ్లేందుకు బోట్లను సిద్ధం చేసుకుంటున్నాం.

– మల్లే కొండబాబు, మత్స్యకారుడు, సూర్యారావుపేట

వేటపై పక్కా నిఘా



సముద్రంలో వేట నిషేధం అమలులో ఉండడంతో గట్టి నిఘా ఉంచాం. జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు సారథ్యంలో ఎఫ్‌డీఓలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఫిష్ ల్యాండ్ పాయింట్లతో పాటు సముద్రంలో నిఘా ఉంచాం. మత్స్యకారులు సైతం సహకరించారు. అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేశాం.

– నూకరాజు, ఎఫ్‌డీఓ, కాకినాడ

క్లుప్తంగా

పోటీతోనే విద్యకు మెరుగు


విద్యార్థులతో మాట్లాడుతున్న సంస్కారభారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి శ్రీనివాసరాజారావు

బోట్‌క్లబ్: పోటీల నిర్వహణ ద్వారా విద్యార్థులలో పోటీ తత్వం అలవడుతుందని సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి శ్రీనివాస రాజారావు అన్నారు. స్థానిక బాలభవన్‌లో శనివారం సంస్కారభారతి, బాలభవన్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 90 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. వేసవి శిక్షణ ముగింపులో భాగంగా విద్యార్థులకు బహుమతులు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ పర్యవేక్షకురాలు శారద, సంస్కారభారతి ఉపాధ్యక్షుడు విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి, కార్యదర్శి ఆనెం ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పరిమళ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీహెచ్‌ఎంజీ పరిమళ

కాకినాడ రూరల్: మండలంలోని పి.వెంకటాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సీహెచ్‌ఎంజీ పరిమళ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల డైరెక్టుగా ప్రిన్సిపాల్‌గా నియమకం కావడంతో జగ్గంపేట నుంచి ఆమె పదోన్నతిపై పి.వెంకటాపురం గురుకుల పాఠశాలకు వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా పనిచేసిన సుశీల ఇదే స్కూల్‌లో కొనసాగనున్నారు.

ఏఎస్‌డీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నాక్-బీ ప్లస్ గ్రేడ్


నాక్ గుర్తింపు పత్రాన్ని చూపుతున్న కళాశాల అధ్యాపకుల బృందం

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)కు నాక్ బి ప్లస్ గుర్తింపు వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనంత లక్ష్మి అన్నారు. మే 19, 20 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో నాక్ పీఆర్ టీమ్ పరిశీలించిందని, నాలుగోసారి జరిగిన ఈ పరిశీలనలో 2.72 స్కోరుతో కళాశాల విజయవంతంగా నాక్ బీ ప్లస్ గ్రేడ్‌ను సాధించిందన్నారు. ఇది 3వ సైకిల్‌లో సాధించిన బి గ్రేడ్ 2.37 స్కోరు కంటే అధికం అన్నారు. ఈ గ్రేడ్ నాణ్యమైన విద్యను అందించడంలో కళాశాల నిబద్ధతకు, నిరంతర అభివృద్ధి పట్ల కళాశాల అంకితభావానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బృందాన్ని, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని పూర్వ విద్యార్థులను అభినందించారు.

ప్రాచీన వైద్య విధానం నాడీపతి


నాడీపతి వైద్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చల్లా శ్రీనివాసమూర్తి

కాకినాడ రూరల్: వ్యాధులను నిర్ధారించడానికి చికిత్స చేయడానికి, నయం చేయడానికి, ప్రత్యామ్నాయ వైద్య విధానం నాడీపతి అని ఆ వైద్య నిపుణులు డాక్టర్ చల్లా శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నాడీపతి వైద్యుడు పి.కృష్ణంరాజు సహకారంతో ఉచితంగా నాడీపతి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి మందులు వాడకుండా రోగికి చికిత్స చేయడమే నాడీపతి వైద్య విధానమని అన్నారు. అనంతరం పలువురికి వైద్య చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, కె.శ్రీరామరాజు, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం గ్రామ సచివాలయం -2 వద్ద రమణయ్యబీడు యూత్ ఆధ్వర్యంలో శనివారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని వైభవంగా గ్రామంలో ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నసమారాధన కార్యక్రమంలో తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఐపీఎల్ మ్యాచ్‌ల వీక్షణకు ప్రత్యేక స్క్రీన్లు


జెర్సీలను ఆవిష్కరిస్తున్న గైక్వాడ్, లక్ష్మణమూర్తి

నాగమల్లితోట జంక్షన్: ఐపీఎల్ మ్యాచ్‌ల కోసం క్రికెట్ ప్రేక్షకులకు ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాట్లను చేసినట్లు బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ ఆల్విన్ గైక్వాడ్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు కార్యాలయ ఇంచార్జి మేకా లక్ష్మణ మూర్తి తెలిపారు. శనివారం కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో వారు విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఐపీఎల్ క్వాలిఫై, ఫైనల్ మ్యాచ్‌ల వీక్షణకు కాకినాడలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. జూన్ 1వ తేదీన పంజాబ్, ముంబై జట్ల మధ్య జరిగే క్వాలిఫై మాచ్‌తో పాటు మూడో తేదీన జరిగే ఫైనల్ కోసం ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఐపీఎల్ మ్యాచ్‌లు ఎంతో ప్రాచుర్యం పొందాయని అందులో భాగంగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు కృషితో ఈ స్టేడియంలో ప్రచార వేడుకలను స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. జూన్ 1, 3వ తేదీన జరిగే మ్యాచ్‌లు సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయని వారు తెలిపారు. అనంతరం జెర్సీని వారు ప్రారంభించారు.

యోగాంధ్రలో ఉత్సాహంగా పాల్గొనాలి


త్రీలైట్స్ జంక్షన్ ప్రధాన రోడ్డులో యోగా శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు

కాకినాడ సిటీ: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర ఉచిత యోగా శిబిరంలో ఉద్యోగులు, నగర ప్రజలు ముఖ్యంగా ఆరోగ్యభిలాషులంతా ఉత్సాహంగా పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ యోగా గురువు చిట్టూరి చిట్టిబాబు శనివారం పిలుపునిచ్చారు. యోగాంధ్ర మాసోత్సవాల పేరిట రాబోయే 11వ అంతర్జాతీయ యోగ దివస్‌లో కోట్లాది మంది ప్రజలను భాగస్వాములను చేయాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ గత ఆరు రోజులుగా ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు కార్పొరేషన్, సచివాలయాలు, మెప్మా ఉద్యోగులకు, పురప్రజలకు కాకినాడ రామారావుపేట 3 లైట్స్ జంక్షన్‌లో రోడ్ యోగ పేరిట నిర్వహిస్తున్న ఉచిత యోగ క్యాంపు విజయవంతంగా కొనసాగుతోందన్నారు. నేడు ప్రభుత్వమే స్థానిక సంస్థలు, సచివాలయ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా యోగాంధ్ర ఉచిత యోగ శిక్షణ శిబిరాలను ప్రజల వద్దకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్యాంధ్రులుగా నిలబడాలన్నారు. ఐక్యత, సహకారం, సమన్వయం, శాంతి, సామరస్యం లాంటి విలువలతో సంపూర్ణ మానవులుగా ఎదగడానికి యోగా సాధన ఒక దిక్సూచిలా సహాయపడగలదని చిట్టిబాబు అన్నారు. ఈ శిబిరంలో టీపీఆర్‌వో శైలజ, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కె.సూర్యప్రకాష్, యూపీఏ సెక్షన్ సూపరింటెండెంట్ సతీష్‌బాబు, మెప్మా సీఎంఎం వెంకట్రాజు, మున్సిపల్ కార్పొరేషన్, సచివాలయాలు, మెప్మా తదితర కార్యాలయాల ఉద్యోగ సిబ్బంది, విద్యార్థులు, పురప్రజలు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ స్థాపనకు కృషి


ధూమపానం నష్టాలను వివరిస్తున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

బోట్‌క్లబ్: పొగాకు రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని జీజీహెచ్ విశ్రాంత సూపరింటెండెంట్ వెంకట బుద్ధ అన్నారు. స్థానిక సత్యడెంటల్ క్లినిక్‌లో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వల్ల కుటుంబం, సమాజం, పర్యావరణంపై చెడు ప్రభావం పడుతుందన్నారు. ఊపిరితిత్తులు, స్వరపేటిక, నోరు, అన్నవాహిక, గొంతు, మూత్రాశయం, మూత్రపిండాలు, కాలేయం, క్లోమం, పెద్దపేగు, గర్భాశయం వంటి అనేక రకాల క్యాన్సర్లకు, తీవ్రమైన మైలోయిడ్ లుకేమియాకు కారణమవుతుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ పొగాకు, నికోటిన్ పరిశ్రమలు తమ ఉత్పత్తులు ఆకర్షణీయంగా మార్చి యువతను ఆకట్టుకుంటున్నాయన్నారు. సినీ హీరోలు, క్రీడాకారులు పొగాకు, గుట్కా, మద్యం ప్రకటనలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీవల్లి, లిఖిత, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజానికి కృషి

కాకినాడ రూరల్: పిన్నవయసులోనే ధూమపానానికి అలవాటు పడి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుందని తాగే వారితో పాటు పీల్చేవారికి, చుట్టుపక్కల వారికి కూడా హానికరం కాబట్టి ధూమపానానికి వ్యతిరేకంగా ఉండాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 1988 నుంచి మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా జరుపుకొంటున్నామని అన్నారు. పొగాకు తాగడం వలన కలిగే అనర్థాలను తెలియజేసి ప్రజలలో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం లక్ష్యమన్నారు. ధూమపానం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, స్వరపేటిక, గొంతు క్యాన్సర్ తదితర జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. పొగాకు మనం తాగిస్తున్నాం అనుకుంటాం కానీ అదే మనలను తాగేస్తుంది అనేది గమనించాలని అన్నారు. పొగాకు వినియోగాన్ని తగ్గించాలనే సిగరెట్టు బాక్స్ మీద ధూమపానం ఆరోగ్యానికి హానికరం అని ముద్రించడంతో పాటు సినిమా హాల్లో ధూమపానం నష్టాలపై ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరమన్నారు. ధూమపానం చేయడం తగదని డాక్టర్ అడ్డాల తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు, ఎస్. శ్రీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.


పొగాకు ఉత్పత్తులు వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్న జీజీహెచ్ విశ్రాంత సూపరింటెండెంట్ వెంకట బుద్ధ

ఖాళీ కంచాలతో నిరసన

సామర్లకోట: మున్సిపాలిటీలో పని చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం 25వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా కారికులు ఖాళీ కంచాలతో తమ నిరసనను తెలియజేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఔసోర్సింగ్ కార్మిక సంఘ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగుల కంటే కాంట్రాక్టు కార్మికులు ఎక్కువగా చేస్తున్నా గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికుల శ్రమ దోపిడికి గురవుతున్నారన్నారు. 15 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, విధి నిర్వాహణలో కార్మికుడు మరణిస్తే రూ.10లక్షలు, అంగవైకల్యం పొందితే ఐదు లక్షలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్ కార్మికులకు రూ.29,200, నాన్ స్కిల్ కార్మికుడుకి రూ.24,500 వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెల తమకు రూ.13వేలు చేతికి అందుతుందని, ఆ జీతంతో కుటుంబాన్ని ఏవిధంగా పోషించుకొవాలని ఆయన ప్రశ్నించారు. తమ కుటుంబాలు ఆకలితో అలమటించడం వలనే ఖాళీ కంచాలతో నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సమస్యల పట్ల స్పందించి ప్రజలకు మంచి సేవలు అందే విధంగా కృషి చేయాలన్నారు. ఆందోళనలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.


ఖాళీ కంచాలతో నిరసన తెలియజేస్తున్న సామర్లకోట మున్సిపల్ కార్మికులు

కోవిడ్ వేళ ఆపద్బాంధవులు

వలంటీర్ల సేవలను తలచుకుంటున్న ప్రజలు

కాకినాడ క్రైమ్: కోవిడ్ నాటి విపత్కర పరిస్థితులు మరో మారు ఆవిష్కృతం కాబోతున్నాయా! అనే ఆందోళనలో ప్రజలు ఉన్నారు. చాపకింద నీరులా విస్తరిస్తున్న కోవిడ్ మహమ్మారి ప్రమాదంపై ప్రభుత్వ వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం హైమాంలో కోవిడ్ వేళ వలంటీర్లు ప్రజలకు అందించిన సేవలను గుర్తుచేసుకుంటున్నారు. జిల్లాలో వందలాది వలంటీర్లు అప్పటి ప్రభుత్వం పిలుపుతో కోవిడ్ బాధితులకు అండగా నిలిచారు. మహమ్మారి బారిన పడినవారికి ఆరోగ్య కేంద్రాల నుంచి మందుల పంపిణీ, ఆస్పత్రులకు తరలింపు, ఆక్సిజన్ అందించడం, సేవా సంస్థల ద్వారా అందిన ఆహారం, ఇతర ప్రయోజనాలు బాధితులకు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు.

ఈ సందర్భంగా వందలాది మంది వలంటీర్లు కోవిడ్ బారిన పడ్డారు. ప్రజల సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న వలంటీర్లను మహమ్మారి ఏమి చేయలేకపోయింది. గత ప్రభుత్వం వారి సేవలు పూర్తి స్థాయి సహకారాడిన్ని భద్రత కల్పించింది. ఉత్తమ సేవకులకు అవార్డులు కూడా అందజేసింది.

ముందస్తు ఖరీఫ్‌కు సిద్ధం కండి

- నేడు సాగునీటి విడుదల
- నానో ఎరువులతో ఖర్చులు ఆదా
- జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు విజయ్‌కుమార్


పెనుగుదురులో అపరాల సాగును పరిశీలిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్

కరప: రైతులు మూడు పంటలు దక్కించుకోవాలంటే ముందస్తు ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. ముందస్తు సాగుతో అక్టోబర్ నెలాఖరుకు పంట చేతికి వస్తుందని, దీంతో నవంబరు నెలలో వచ్చే తుపాన్ల గండం నుంచి గట్టెక్కి పంటను దక్కించుకోవచ్చన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్‌లతో కలసి ఆయన మండలం పెనుగుదురులో పర్యటించి అపరాలపంటను పరిశీలించి, ముందస్తు సాగుపై రైతులు అనుసరించాల్సిన విధివిధానాలపై సూచనలిచ్చారు. ఖరీఫ్, రబీ పంటలతో పాటు అదనపు ఆదాయం చేకూర్చే మూడో పంటకు సమాయత్తమవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ప్రభుత్వ ఆదేశాలతో ఈ ఏడాది ఆదివారం సాగునీరు విడుదల చేస్తున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ ప్రకటించారన్నారు. 4, 5 రోజుల్లో పంటకాలువలకు సాగునీరు వస్తుందన్నారు. ఈ లోగా రైతులు ఖరీఫ్‌సాగుకు అవసరమయ్యే విత్తనాలు సిద్ధం చేసుకుని, వ్యవసాయ పనులు ప్రారంభించి, నారుమళ్లు తయారు చేసుకోవాలన్నారు. 15వ తేదీకల్లా నారుమళ్లు వేసుకుని, జూలై 15 నుంచి 20వ తేదీనాటికి వరినాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. బెంగాల్ పద్ధతి కానీ, వెదజల్లు పద్ధతికానీ అనుసరిస్తే పెట్టుబడులు ఆదా అవుతాయన్నారు. దీంతో అక్టోబరు నెలాఖరుకు మొదటిపంట కోతకు వచ్చి, నవంబర్ నెలలో వచ్చే తుపాన్ల గండం నుంచి తప్పించుకుని, పంటను దక్కించుకోవచ్చన్నారు. నవంబరు నెలలో రబీ నారుమళ్లు వేసుకుంటే మార్చి 15వ తేదీకల్లా రబీ కోతలు పూర్తవుతాయన్నారు. దీంతో మూడో పంటగా అదనపు ఆదాయం చేకూరే అపరాలను సాగుచేసుకోవచ్చని జేడీఏ విజయ్‌కుమార్ వివరించారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా సాగునీరు వచ్చిన వెంటనే సార్వాకు సమాయత్తం కావాలన్నారు. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ముందస్తు సాగుకు రైతులను చైతన్య పరచాలన్నారు. ఈ ఏడాది 50 వేల ఎకరాల్లో అపరాలు సాగుచేసేలా రైతులను ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసే సన్న రకాలనే సాగుచేసుకోవాలని ఆయన సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎంటీయూ 1064, ఎంటీయూ-1061, ఎంటీయూ-1121, పీఆర్-126 రకాలు తీసుకునే అవకాశం లేదన్నారు. అలాగని ఆ రకాలను సాగు చేయవద్దని వ్యవసాయశాఖ చెప్పడం లేదని, వాటికి బయట మార్కెట్ బాగుంటుందని అనుకుంటే రైతులు ధైర్యం చేసి సాగు చేసుకోవచ్చన్నారు. డెల్టాలో ఎంటీయూ-7629 (స్వర్ణ), ఎంటీయూ 1318 రకాల దిగుబడులు బాగుంటున్నాయని, వీటితో పాటు ఫైన్ వెరైటీస్ 5204, ఆర్పీ బయో, ప్రైవేటుగా దొరికే సన్న రకాలు సాగుచేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సూచనల మేరకు నానో యూరియా, నానో డీఏపీ వినియోగాన్ని పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. రసాయనిక ఎరువుల కంటే తక్కువ ధరలలో లభించే నానో ఎరువుల వాడకం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. నానో ఎరువులు, డ్రోన్ టెక్నాలజీ వినియోగంతో పెట్టుబడులు ఆదా అవుతాయన్నారు. పొటాష్‌ను కూడా వినియోగించడంవల్ల నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా నాణ్యమైన ఆహార ఉత్పత్తులు పెంచేందుకు ప్రకృతి వ్యవసాయంపై రైతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. పీఎండీఎస్ ద్వారా 32 రకాల విత్తనాలను సరఫరా చేస్తున్నామన్నారు. వీటి ద్వారా నేల సారవంతమవడమే కాకుండా నాణ్యమైన పంట దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు అధిక ధర లభిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై విస్తృతంగా ప్రచారం చేసి, రైతులను ప్రోత్సహించాలని జేడీఏ విజయకుమార్ కోరారు. రైతులు తుమ్మలపల్లి గోవిందు, పబ్బినీడి చక్రరావు, ఎస్.ఆంజనేయులు, బండారు గోపాలకృష్ణ, పెంకే మల్లేశ్వరరావు, ఏఈఓ బి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి రథానికి స్వాగతం

సామర్లకోట: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు సందర్భంగా చేపట్టిన రాష్ట్రవ్యాప్త రథయాత్ర శనివారం సామర్లకోటకు చేరుకుంది. సత్యసాయి ప్రేమ వాహిణి రథానికి భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి నాయకులు మాట్లాడుతూ ఏప్రిల్ 26వ తేదిన శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమైన రథయాత్ర నవంబరు 24తో ముగుస్తుందన్నారు. శత జయంతి వేడుకలను పురస్కరించుకొని సేవా సమతి సభ్యులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సత్యసాయి బాబా సేవలను భక్తులకు వివరిస్తామన్నారు. కాకినాడ జిల్లాలో మరో రెండు రోజుల యాత్ర కొనసాగుతోందన్నారు.

సారా విక్రేత అరెస్టు


సారాతో ఎక్సైజ్ అధికారుల అదుపులో నిందితుడు

సామర్లకోట: స్థానిక కుమ్మర వీధిలో సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని శనివారం సాయంత్రం కాకినాడ నార్త్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ కె రామమోహనరావు మాట్లాడుతూ గుబ్బల నూకరాజు కుమ్మర వీధిలో సారా విక్రయిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో తనిఖీలు చేయగా అతని వద్ద 20 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకొన్నామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కాకినాడ కోర్టుకు తరలించగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు. ఈ దాడిలో ఎస్సై ఎంవీవీబీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.